# వరాల మూట

ఒక్కేసి పువ్వేసి సందుమామ ఒక్క జాము ఆయె సందమామ

ఒక్క జాము పొద్దు సందుమామ శివుని పూజలాయె సందమామ

చెరువు బండలమీద ఎండ చిర్రు బుర్రు లాడుతోంది. మనుషుల గుడ్డల మాలిన్యం ఉతికెయ్యడం మావంతు, మనసుల మాలిన్యం ఉతికెయ్యడం మీ వంతు అన్నట్టుగా మోకాళ్లవరకు చెరువులో దిగిన మగువలు పాటలో లీనమయింద్రు. గుప్పుగుప్పున బీడీలు కాల్చుకుంటూ మగవాళ్లు ఒడ్డున గుడ్డలారేస్తున్నారు. కష్టజీవుల గళాలకు మేము గులాములమన్నట్టు చెట్టకొమ్మలు తలలాడిస్తున్నై. పొద్దెక్కుతూనే ఉంది.

రెండేసి పూలేసి సందమామ రెండు జాములాయె సందమామ

రెండు జాముల పొద్దు సందమామ శివుని హారతాయె సందమామ

పాట పారుతూనే ఉంది. ఎప్పుడూ కలివిడిగా మాట్లాడ్తూ, నవ్వుతూ, కవ్విస్తూ పాటందుకునే ఎల్లవ్వ పెదాలీరోజు కదలడంలేదు. పాట రెండు చరణాలు దాటిపోయినా గొంతు శృతి కాలేదు. పచ్చిగుడ్డను పిండేస్తున్నట్టు మనసు మెలిపెడ్తూనే వుంది. చిలక పలుకుల చిన్నారి రాజి కళ్లలో కదలాడుతూనే ఉంది. ఎద తెరమీద దాని చిలిపిచేష్టలు చెంగుచెంగున గంతులేస్తున్నై.

మచ్చుజల్లి మాయం జేసినట్టు - రాజి....ఎంతపంజేసింది! ఎటు మాయమైంది?..

రోజూ నిద్ర లేవగానే "నానమ్మా!" అంటూ మల్లెతీగలా అల్లుకుపోయేది. చాయ్‌లో బన్ను అద్దుకుతింటూ బుల్లిపెదాల్ని సున్నాల్లా చుట్టేస్తూ తియ్యతియ్యని ముచ్చట్లు చెప్పేది. అరేండ్ల అర్భకురాలు ఆరిందోలె ఊకొడుతూ తన యాభయ్యేళ్ల బాధల్ని, గాధల్ని వినేది. బంగ్లా బాలమ్మ కూతురు పెండ్లిల కట్నంగా ఇప్పించుకున్న తెల్లని గౌనులో మల్లెపూవులాగుండేది. తన వెంట ఇల్లిల్లూ తిరుగుతూ మురిపాల మూట లందించేది. బట్టలుతికి ఒడ్డుకు పడేస్తుంటే సీతాకొక చిలుకోలె ఎగురుతూ తీసుకెళ్లి వాళ్ల ఆగయ్యతాత కందించేది.

"నారదమునోలె మా నడుమ నువ్వెందుకే రాజీ!" అని ఆగయ్యంటే కిలుక్కున నవ్వేది.

పెద్ద షావుకారు కొడుకు పెండ్లిలో అతని కెదురు తిరిగి చాకలి కట్నంగా ముక్కుపిండి వసూలు చేసిన గజ్జెల పట్టాగొలుసులేసుకుని జింకపిల్లోలె గంతులేసేది. రాత్రికి తన చేతి పాలబవ్వ తిని తన ఒడిలోనే నిద్రబోయేది.

"ఎక్కడి బట్టలక్కడ పెట్టి ఏందే ఎల్లక్కా గట్లున్నవు!" పక్కబండమీద ఉతుకుతున్న పద్మ అడిగింది చెదిరిన వెంట్రుకల్ని సవరించుకుంటూ.

"ప్చ్... మల్లెపువ్వుకు ముల్లుగుచ్చినట్టు వనసంతా ఎట్లనో ఉందే...." రేవులోంచి బయటికొచ్చి చెట్టుకింద కూచుంది.

"నీయవ్వ! గా బుచ్చిపోరి కనబడకుంటే గింత పరేషానా?" అగయ్య గుర్రుమన్నడు. బీడీ పారేసి స్వయంగా రేవులకు దిగిండు.

ఎల్లవ్వ ఒళ్లంతా కళ్లైపోయినై. అవి నిన్న రాజి ఆడుకున్న చెట్లనీడల్ని, చాకిరేవు బండల్నీ, కన్పించినంత దూరం చెరువుకట్టనూ తుడుముతున్నై.

ప్చ్... లాభం లేదు. మత్తడి పోచమ్మ తల్లీ! నా రాజి కనబడితే నీకు ఐదు కొబ్బరికాయలు కొడ్తా. కడుపుల కాగుతున్న ఎసరు పొంగి గొంతుదాకా వచ్చింది. దాన్ని అదిమి పెట్టడం కష్టమైపోతోంది. బిగ్గరగా ఏడ్వాలనిపిస్తోంది.

కాని తన ఏడుపును పట్టించుకునేదెవరో!

కొడుకూ కోడలు ఇంటిపట్టున, చెరువు గట్టున చిల్కాగోరెంకలలోలె ముచ్చట్లు జెప్పుకుంట మురిసిపోవాలని అందరి తల్లులోలె తానూ కలలుగన్నది.

"గిప్పుడే నాకు పెండ్లెందుకమ్మా!" అని కొడుకు కనకయ్య వెనకా ముందాడినా.

"వాని పెండ్లికి తొందరెందుకే! కోరవయసులుంది గదాని గుణం, గణం తెల్వని కోడల్ను దెచ్చుకుంటే కొంప మునిగి పోతది" అని భర్త అగయ్య అధిక్షేపించినా వినకుండా

"ఏ వైసుల జరిగేది ఆ వైసుల జరగాలెగదా" అని పట్టుపట్టింది.

ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ పదవి దొరకదని అందరి కాళ్లూ పట్టుకునే అపర రాజకీయ నాయకురాలిలా చక్రం తిప్పింది. అప్పుల కుప్పల్ని పెంచేసి అన్న కూతురు కమలతో పెండ్లి చేయించింది.

పరువును కుదువబెట్టి పదవి దక్కించుకున్న బడానాయకురాలిలా గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది.

అప్పుడే రేకులిప్పిన కమలం పువ్వోలె కమల ఎర్రగా బుర్రగా ఉన్నమాట నిజమే గాని దాని కాలు ఒక్కచోట నిలిచేది కాదు. చిత్రమైన చూపులు, విచిత్రమైన నవ్వులు, అందచందాలన్ని ఒక్కనికే అందిస్తే మంచిగన్పించలేదేమో, నలుగురికి పంచిస్తెనే నయమనుకుందేమో, మూడ్రోజులు మెట్టినింట్లుందంటే వారం రోజులు పుట్టినింట్ల గడిపేది. అది అంత పెద్ద కిలాడి అని తానెప్పుడూ ఊహిచంలేదు. రాజికి మూడేండ్లు రాకముందే పట్నం ప్రియునితో పరారైంది. అయినా అది రాజికి జన్మనించ్చిందే గాని ప్రేమగా లాలాంచలేదు. పాలిచ్చి పెంచలేదు. డబ్బాపాలే గతైపోయినై.

"పేగుదెంచుకొని పుట్టిన రాజి నాది. నా రక్తం. నా ఇంటి దీపం..." అనుకుని తానే తల్లయి గుండెలకు హత్తుకుంది.

"బోరె మపొంటి తల్లే పోయింది. బొంతసొంటి గీపిల్ల మనకెందుకూ?" అని అగయ్య ఈసడించుకున్నాడు. కమల తండ్రిని పిలిపించి చిందులేసిండు.

"ఆ కమల పోతే పోయింది. ఒంకో విమలను దెచ్చి నా కొడుక్కు జేస్తా. మీ రాజి పోరిని మీరు దీస్కపోండ్రి" అని పట్టువట్టిండు.

సింహాల గుంపుల చిట్టెలుకోలె రాజి బెదిరిపోయింది. తన కాళ్లకు చుట్టుక పోయింది. "నానమ్మా... నానమ్మా" అంటూ వణికి పోయింది.

"నా రక్తమే నన్ను మోసం జేసి నలుగురిట్ల తలకాయ దించేసింది బావా!" కమల తండ్రి కంటతడి పెట్టిండు.

"నా ఎత్తు కూతురే నా కండ్లల్ల కారం గొట్టిపోయింది. ఇంగ గీపోరిని పెంచి పెద్దజేస్తే నన్నుద్దరిస్తదా?" గొడగొడ ఏడ్చుకుంట వచ్చిన దారి వట్టిండు.

"ఇంతకూ ఈ రాజిపోరి నా ఒక్కనికే పుట్టిందా?" కన్నకయ్య కొండమీది కొండెంగోలె గంతులేసిండు.

వీళ్లందరికీ రాజి అంటే ఎందుకింత కోపం? అదేం జేసిందని! ఓ చెంపగొడ్తే పాలు, ఇంకో చెంప గొడ్తే రక్తం, మాయాలోకం మర్మాలు దానికేం దెల్సు. తాను మాత్రం రాజి విషయంలో రాజీ పడలేదు. రెండు మూడేండ్ల సాధించింది. ఆ తర్వాత పరిస్థితి తన చెయ్యి దాటిపోయింది.

ఆగయ్య ఉడుంపట్టు వట్టిండు. మొగుణ్ణొదిలేసిన తన అక్క కూతురు రమణితో కనకయ్యకు మారు మనువు జేసిండు. రెండున్నర తులాల బంగారం దాన్ని కన్నోడి చేతుల వడ్డాకనే రమణి తనింటి కోడలైంది.

కొచిప్పలోలె కళ్లూ, దానిమ్మ గింజలోలె పళ్లూ, జారుడు బండోలె నున్నటి ఒళ్లు... చూస్తే చుక్కోలెనే ఉంటుంది రమణి, కాని లేస్తెనే కుక్కోలైపోతది. మూడు నెల్లల మొగనికి ముగదాడేసింది. పులోలె వున్న కనకయ్య పెండ్లాం ముందు పిల్లై పోయిండు. రాజికో తల్లి వస్తుందనుకున్న తన ఆశల పల్లకి తలకిందులైంది.

రాజి కన్పిస్తే చాలు. పడగెత్తిన నాగుంబామోలె బుస్సు బుస్సులు, కస్సు కస్సులు. అది ఏం మాట్లాడినా చీదరింపులు, నిప్పుల మీద ఉప్పు జల్లినట్టు చిటపటలు. తన సలహామీద రాజి "చిన్నమ్మా!" అంటూ దగ్గరికెళ్ళింది. రమణి రాక్షసైపోయింది.

"అంగట్ల అమ్మా అంటే ఎవనికి పుట్టినవ్ బిడ్డా అన్నట్టు గాలికి పుట్టిన పోరివి గట్లంటవా? నీ జాగల నువ్వు పడుండు. నా జోలికొస్తే నీ మొకం పలగ్గొడ్తనే మొండిముండా" అని చెంపలు వాయించింది. కందిపోయిన లేత చెంపలుబ్బి పూర్ణం బూరెలైపోయినై.

రాజి వెక్కివెక్కి ఏడుస్తుంటే తన కడుపుల సప్తసముద్రాలు పొంగినై. రోషం పొడుచుకొచ్చింది.

"అయ్యో! గా పోరిని కడుపుల వెట్టుకుని పెంచుతవ నుకున్ననే రమణీ! నీకిది నాయం గాదు బిడ్డా!" అని మందలించింది.

"గాలికి వోయే కంపను ఏలుకు తలిగించుకోను. ఎవని గండం? ఎవని పిండం? కన్నదానికి లేని ప్రేమ కొన్నదానికెందుకూంట?" తుపుక్కున్న ఉమ్మేసింది రమణి. రంకె వేస్తూ హంగామా చేసింది. చుట్టూ మూగిన జనాలు తలా ఓమాట అంటూంటే తండ్రీకొడుకులు చెరో మూల కూచుండి నవ్విండ్రు.

"ఇష్టమొచ్చినట్ల మాట్లాడ్తే ఈపు ఇరగ్గొడ్తా" అందది. తనకు అరికాలు మంట నెత్తికెక్కింది. రాజిని చంకలేసుకుని "ఈసారి దీన్నేమన్నా అంటే సిగ గొరిగిచ్చి సున్నంబొట్లు వెడ్తా ఏమనుకున్నవో ఈ ఎల్లవ్వంటే" ఝాడించి పారేసింది.

మూతి, ఛాతి మూడు వంకర్లు, చేతులు కాళ్ళు ముప్పైవంకర్లు దింపుకుంటూ లోపలికెళ్ళింది రమణి. తెల్లా సరికి మొగునితో సహా మాయమైంది.

ఆగయ్య ఓ నవ్వు నవ్వి "నువ్వో పరికి కంపవట. నీతోని గెల్వలేమని వాల్లు ఇంట్ల నుంచి ఎల్లిపోయిండ్రు" అని కాండ్రించి ఉమ్మేసిండు.

పిచ్చెక్కినట్టయింది. కండల్ని కత్తులతో కోసి కారం చల్లినట్టనిపించింది. నెత్తి కొట్టుకుంది. జుట్టు పీక్కుంది.

"మరి వాళ్లకు నువ్వెందుకు సముదాయించలేదయ్యా?" తను నిలదీస్తుంటే గొంతు బొంగురువోయింది.

"గా రాజి పోరి ఉన్నన్ని రోజులు వాళ్ళీ ఇంటికి రారటా. దానికి నేనేం జెయ్యాలె? ఆ పోరి బాయిలపడి ఛస్తే పీడవొయ్యేది" గుర్రు మన్నడు.

అరుగుమీద కూచున్న రాజి అంతా వింటున్నది. మిలమిలలాడే కళ్లతో అటూ ఇటూ చూస్తోంది.

"రెక్కలొచ్చిన పచ్చులు ఎగిరిపోయినై. గంతేకదా!" అంది తను ఆవేశాన్ని తగ్గించుకుని.

"గంతే అనుకో, నేనూర్లెకు వొయ్యి బట్టలుదెస్తా" నని చుట్ట అంటించుకుని బయలు దేరిండు ఆగయ్య.

కనిపెంచిన కొడుకు అంటే ఓ కలల పంట అనుకుంటి. వాడు పెరిగి పెద్దోడై పెరుగన్నం పెడతాడనుకుంటి. ఇంతేనా? రెక్కలు ముక్కలు జేసుకుని రేవుల బట్టలుతికి, కాలికి బలపం కట్టుకొని ఇల్లిల్లూ తిరిగి పెంచితి. తాగుబోతు మొగుడి పిడిగుద్దులు భరించి వానికి మంచి బట్టలు కుట్టిస్తి. గప్పుడు గదంతా జేస్తే గిప్పుడు నాకేం మిగిలింది?

కళ్లద్దుకుంటూ కనకయ్య లాండ్రీ దుకాణందాకా వెళ్లాలనుకుంది. గబగబా బన్ను కొనుక్కొచ్చి రోజట్లాగే చాయచేసి గ్లాసులో పోసి రాజిని కేకేసింది.

కాని ఏదీ! రాజి ఏదీ? ఇల్లంతా వెతికింది. కనబడలేదు. వాడంతా వడబోసింది. రాజి జాడలేదు. బట్టలుతికే ఇళ్లన్నీ తిరిగింది. బారెడు పొద్దెక్కింది. కడుపులో కవ్వం దింపి చల్లజేసినట్లయ్యింది.

"అయ్యో బిడ్డా, ఎక్కడ వోతివే? ఏమైవోతివే?" దుఃఖమాగక బోర్‌మంది. చాకిరేవుకు తయారైన ఆడాళ్లు తలా ఓ మాట నచ్చజెప్పి వెళ్ళిపోయింద్రు. తనకు మాత్రం దునియా అంత అయోమయంగా కన్పించింది. ఆగయ్య రాగానే అతని గుండెలమీద వాలి మరోసారి గొల్లుమంది.

"నీయవ్వ! గా మొకం లేని పోరికోసం మొకముబ్బేదాకా ఏడుస్తవా? ఊకో, జల్ది తయారుగా, చాకిరికి వోవాలె" అంటే వీపు నిమిరిండు. అతడే అన్నం వండిండు.

"మీ బతుకులల్ల బండలు వడ" కడుపులో పొంగు తగ్గలేదు. ఎగబడింది. "ప్రపంచమంటే తెల్వని గా పోరి మిమ్ములేమందయ్యా! అది లేకుంటే నేను బతకలే నయ్యా" కోపం బేలతనంగా మారింది. "నేనింగ చాకిరికి రాను. బట్టలుతక" నేలమీద కూచుండిపోయింది.

ఎల్లవ్వ చాకిరేవుకు రాకపోతే ఎక్కడి బట్టలక్కడనే ఉండిపోతయ్. ఎట్లాగైనా తీస్కపోవాలె. అనుకున్నడు ఆగయ్య.

"అరె పిచ్చాదానా! రాజి మాత్రం నిన్నిడిసి ఉంటదా! అప్పటివరకు చెరువు దగ్గరకొస్తది చూడు. పని బంద్ వెట్టి ఏడ్చుకుంట కూకుంటే పిచ్చిలేస్తది" అని ధైర్యం నూరిపోసిండు.

బలవంతంగా తినిపించిండు. ప్రాణం చల్లబడింది. ఏదో ఆశాపాశం చెరువుదాకా తీసుకొచ్చి చాకిరేవులోకి దింపింది. కాని ఆశ అంగడి పాలైంది. ఇప్పుడేం చెయ్యాలి!

ఒకవేళ... రాజి తండ్రి దగ్గరికే పోయిందేమో!

ముసురుకుంటున్న ఆలోచనలు కసురుకుంటున్న ఆగయ్య మాటల్ని విన వ్విలేదింత వరకు.

"లెవ్వే. లే.. పొద్దుగూకుద్ది. బట్టలు ముల్లెలు గట్టి గాడ్దులమీదేసిన పా. లెవ్వు!" భుజం పట్టి లేపాడు.

అబ్బో... శానా పొద్దుపోయింది. తోటోళ్లంతా గాడ్దుల వెంట వెల్తున్నరు. సూర్యుడు. పడుమటి కొండల చాటుకు పోతున్నడు. ముసలి కిరణాలు చెరువు నీటిమీద చెడుగుడు ఆడుకుంటున్నె. ఆగయ్య వెంట యాంత్రికంగా అడుగులేస్తూ ఇంటికొచ్చింది.

గోధూళితో ఆకాశం ఎర్రబారింది. ప్రాణం ఆగలేదు. రాజి కోసం దేవులాడ్తునే ఉంది.

"నేనోసారి మన కనకయ్య ఇస్త్రీ షాపుదాక పోతానయ్యా" ఆగయ్యతో చేప్పేసి గబగబా అడుగులేసింది. షాపు తెరిచేఉంది. ముందటిగదిలో కనకయ్య ఇస్త్రీ చేస్తున్నడు. వెనకగదిలో రమణ వయ్యారాలొలకబోస్తుంది.

"అరేయ్ కనకా! ఇక్కడికి రాజి వచ్చిందా?"

కనకయ్య తలెత్తి తల్లివైపు చూసి వెంటనే దించేసుకున్నడు.

"గాముంద మొకం జూడద్దనే గిక్కడికొస్తిమి. అది మా ఇంటికెందుకొస్తదటా" గజ్జెల గుర్రమోలె గంతులేస్తూ బయటికొచ్చింది రమణి.

"కాదే... ఎంతైనా వీడు దాన్ని కన్నోడుగదా"

"నీయవ్వ..." ఒంటికాలుమీద లేచిండు కనకయ్య. 'రామేశ్వరం బోయినా శనేశ్వరం ఇడువదన్నట్టు ఇక్కడ గూడా గాపోరి ముచ్చటెందుకే. అది నా దగ్గరికొస్తే చీరి పారేసి చింతగింజలు వోస్తా దాని యమ్మను..." బూతులందుకున్నడు.

కిళ్లీరసాన్ని తుపుక్కున ఉమ్మేసి కిసుక్కున నవ్వింది రమణి. షోడాబుడ్డి పగిలినట్టు భళ్ళున నవ్విందు కనకయ్య. ఎల్లవ్వ గుండెల్లో అగ్నిపర్వతం బద్దలైంది. అసహ్యం. అవమానం నరాల్లో గంతులేస్తూంటే ఉక్రోశం ఉబికొచ్చింది.

"అరేయ్ బాడ్కావ్! నీ జుట్టూ నీ వగలాడి జుట్టూ ముడేసి పొత్తికడుపుల కత్తితోని పొడుస్తా, గా బుచ్చిపోరి ఏం పాపం జేసిందిరా? ఇప్పుడు పెండ్లాం బెల్లమైందా? తల్లి అల్లమైందా?" ఎన్నడూ లేనంత ఆవేశమొచ్చింది కాని మరో మూలనుండి ఏదో దేవులాట.

వీడు నాకొడుకు. నా పేగుచించుకొని పుట్టిండు. వీడు సుఖంగా ఉండాలె. నా రక్తం సల్లగుండాలె. ఆలోచన సూదిమందోలె చొచ్చుకొచ్చింది.

కాండ్రించి గట్టిగా ఉమ్మేసి వెనుదిరిగింది. ఇంటికి తాళం కప్ప వేళ్లాడ్తూంది.

అంటే... ఆగయ్య ఉతికిన బట్టలిచ్చేందు కెళ్లిండన్నమాట. ఊరంతా తిరిగి కడుపునిండా తాగొస్తడు. తాగిన మైకం దిగేదాకా తన్నులాట, గుద్దులాట. నీరసం ఆవహించింది. వీపు గోడకు, గదవ మోకాళ్లకానించి అరుగుమీద కూచుంది. పొద్దున రాజి గిక్కడనే కూచుంది. మెదడు నిండా ఆలోచనలు.

ఇంత బతుకు బతికి ఇంటెనక చచ్చినట్టు గిన్నేండ్లు సంసారం జేసినా కట్టుకున్నోడు పాపమనకపాయె. కడుపుల పుట్టినోడు కయ్యానికి దిగె. కన్నప్రేమకు దూరమైన రాజి పోరి తప్పేముందని? పెద్దోల్ల పాపాలకు పసిపోరి మీద పగవట్టరెందుకూ? ఆ పాపం ఎవలది? ఆ ఉసురు ఎవలకు తగులుద్ది? అది నన్నే నమ్ముకుంది. రాత్రికి నా పక్కల గువ్వోలె ఒదిగిపోయేది. నా ఒడి చిన్నవోయింది. ఇప్పుడు పాలబువ్వ ఎవలకు తిన్పించాలె? నేను బతుకుతుందే రాజి కోసం. రాజిలేని బతుకు నాకెందుకూ? రాజి ఇంగ దొరకదు. నా రాజి నాకు కరువైంది. అంతరాళాల్లో సుడిగుండాలు. ఆగలేని దుః ఖం చెంపలమీద ధారలైంది. ఛీఛీ... ఇంగ నా బతుకు అనవసరం.

చివాలున లేచింది. ఊరిబయటికొచ్చేసింది. శివాలయం పక్కనున్న పాడువడ్డ బావి వైపు దూసుకెళ్లింది. అందులో దుంకితే చావు గ్యారంటీ. ఇంతకుముందోసారి ఇదే బావిలో దుంకాలని వస్తే రాజి వెంటబడింది. బావిగోడ ఎక్కబోతుంటే కొంగుబట్టి గుంజింది. పసిదాని మొకం జూచి ఆనాడా అవమానాన్ని దిగమింగి ప్రయత్నం మానుకుంది. ఇప్పుడు తననాపే వాళ్లెవ్వరూ లేరు.

చీకటి తెరలు భూమాత మీద పరుచుకుంటున్నై. బావి ముందుకెళ్లి చేతులు జోడించింది.



కథా నిలయం
శ్రీకాకుళం

“అమ్మ! గంగమ్మ తల్లీ! నన్ను మన్నించమ్మా. నా రాజి లేనిదే నేనుండలేను. ”

గుండె పొంగుకొచ్చింది. కంటిధారల్ని తుడుచుకుని నడుముకు చుట్టుకోవాలని కొంగు లాగింది. అరె... కొంగు రాదేమిటీ? తన వెనక ఎవలున్నరూ! తన కొంగు పట్టుకుందెవరూ! ప్రాణం ఝుల్లుమంది. గిరుక్కున వెనక్కు తిరిగింది. కళ్లు జిగేలుమన్నై.

రాజి... తన ప్రాణం రాజి. తన వరాల మూట రాజి. “నానమ్మా! ఈ గోడ నాకు ఎక్కరాలేదు. గిండ్ల నన్ను పడేయవా” కొంగు విడిచి చేతులు చాచింది. గుండె కలుక్కుమంది.

“నా తల్లీ... నాయమ్మా! నా బంగారి కొండా!” ఎత్తుకుని ఆబగా ముద్దాడింది. ఒళ్లంతా తడిమింది. వీధిలైట్లు వెలిగాయప్పుడే. రాజి చెంపలమీద ఆరిపోయిన కంటిధారలు.

“మనం చావద్దు రాజీ! మనల్ని చూసినోళ్లే కండ్లల్ల కారం గొట్టుకుని చావాలె. పా.. ఇంటికి పోదాం పా!” గుండెలకు హత్తుకుంది.


రెండు నిండు గుండెల చప్పుళ్లకు స్పందనగా శివాలయం గంటలు గణగణ మోగినై.

“ఏడు జాములాయె సందమామ పొద్దుగూకి పాయె సందమామ.
పొద్దుగూకి పాయె సందమామ శివుని హారతాయె సందమామ......”

ఎల్లవ్వ పెదాలమీద పాట కదలాడింది.

**విపుల - మార్చి, 99**

❖ ❖ ❖ ❖ ❖ ❖



కథా నిలయం
శ్రీకాకుళం